■ e-mail: edc@eenadu.in

త్వరగా ఉద్యోగం రావాలంటే..?



ఇంటర్ (ఎంపీసీ) చదివి, దూరవిద్యలో డిగ్రీ, ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంసీఏ చేశాను. సాఫ్ట్‌వేర్ రంగంలో త్వరగా ఉద్యోగం రావాలంటే ఏ ప్రోగ్రామ్స్ నేర్చుకోవాలి?

- ఎన్.వాసురెడ్డి

■ మీరు ఎంసీఏ ఎప్పుడు పూర్తి చేశారు, ఏదైనా ఉద్యోగానుభవం ఉందా/లేదా అనే వివరాలు తెలియ జేయలేదు. ప్రస్తుతం డేటాసైన్స్‌లో చాలా ఉద్యోగావ కాశాలున్నాయి. ఆ రంగంలో స్థిరపడాలంటే.. ఏదైనా ప్రముఖ విద్యాసంస్థనుంచి డేటాసైన్స్/ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సబ్జెక్టుల్లో పీజీ చేయండి. ఆసక్తి ఉంటే బిజినెస్ అనలిటిక్స్‌లో ఎంబీఏ కూడా చేయొచ్చు. డేటాసైన్స్‌లో ఆసక్తి లేక పోతే, డిజిటల్ మార్కెటింగ్ కోర్సుల గురించీ ఆలోచించండి. అమెజాన్ వెబ్ సర్వీస్ లాంటి కోర్సులు చేసినట్లయితే, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. అలా కాకుండా, జావా ప్రోగ్రామింగ్, ఒరాకిల్, ఈఆర్‌పీ, పైతాన్, వెబ్ డిజైనింగ్ లాంటి కోర్సులూ చేయొచ్చు. యూనివ ర్సిటీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా కాకుండా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రవేశించాలంటే ఉద్యో గానుభవం, ప్రస్తుతం మార్కెట్‌కి అవసరమైన సాఫ్ట్‌వే ర్‌లో పనిచేయగల సామర్థ్యం అవసరం. మీ యూని వర్సిటీలో ఎంసీఏ చదివి, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యో గాలు చేస్తున్నవారితో మాట్లాడి వారి సలహాలను కూడా తీసుకొని ఉద్యోగ ప్రయత్నాలు చేయండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

ఇండియన్ బ్యాంకులో స్పెషలిస్ట్‌లు

చెన్నై ప్రధానకేంద్రంగా ఉన్న ఇండియన్ బ్యాంక్ 18 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: ప్రొడక్ట్ మేనేజర్, టీమ్ లీడ్, సీఏ.

విభాగాలు: బ్యాంకింగ్ లావాదేవీలు-సేల్స్, ఇంటర్నెట్ చెల్లింపు గేట్‌వే, అగ్రిగేటర్, ఏపీఐ బ్యాంకింగ్, యూపీఐ, క్యాష్ అండ్ చెక్ చెల్లింపులు, బీ2బీ చెల్లింపులు తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/ బీటెక్/ సీఏ/ ఎంసీఏ/ ఎంఎస్సీ/ ఎంటెక్/ ఎంబీఏ.

వయసు: కనీసం 25-35 ఏళ్లు ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.1000.

దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

చిరునామా: Chief General Manager (CDO & CLO), Indian Bank Corporate Office, HRM Department, Recruitment Section 254n260, Avvai Shanmugam Salai, Royapettah, Chennai, Pin - 600 014, Tamil Nadu.

దరఖాస్తుకు చివరి తేదీ: 29.05.2023

వెబ్‌సైట్: https://www.indianbank.in/career/#!

కోర్టుల్లో స్టెనోగ్రాఫర్‌లు

రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పనిచేయటానికి 96 స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3 పోస్టుల భర్తీకి తెలంగాణ హైకోర్టు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: గ్రాడ్యుయేషన్.

★ ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి.

★ ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.

వయసు: 18-34 ఏళ్ల ఉండాలి.

ఎంపిక: ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా.

144 టైపిస్ట్ పోస్టులు

రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పని చేయటానికి 144 టైపిస్ట్ పోస్టుల భర్తీకి తెలంగాణ హైకోర్టు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ.

★ ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి.

★ ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.

వయసు: 18-34 ఏళ్ల ఉండాలి.

ఎంపిక: ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్ టెస్ట్) ఆధారంగా.

84 కాపీయిస్ట్ పోస్టులు

రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పని చేయటానికి 84 కాపీయిస్ట్ పోస్టుల భర్తీకి తెలంగాణ హైకోర్టు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: 12వ తరగతి/ ఇంటర్మీడియట్

★ ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి.

★ ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.

వయసు: 18-34 ఏళ్ల ఉండాలి.

ఎంపిక: ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్ టెస్ట్) ఆధారంగా.

ఈ మూడు రకాల పోస్టులకూ...

దరఖాస్తు ఫీజు: రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 25.05.2023 నుంచి.

దరఖాస్తుకు చివరి తేదీ: 15.06.2023.

స్కిల్ టెస్ట్ తేదీ: జులై 2023.

వెబ్‌సైట్: https://tshc.gov.in/getRecruitDetails

ప్రవేశాలు

నిఫ్టెమ్‌లో వివిధ ప్రోగ్రాములు

భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన హరియాణా (సోనిపట్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) వివిధ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

1) బీటెక్ ప్రోగ్రాం (ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్)

కోర్సు వ్యవధి: నాలుగేళ్లు.

అర్హత: ఇంటర్మీడియట్ (10+2)తో పాటు జేఈఈ (మెయిన్స్)-2023 అర్హత.

ఎంపిక: సీఎస్ఏబీ నిర్వహించే సెంట్రల్ కౌన్సెలింగ్ ద్వారా.

2) ఎంటెక్ ప్రోగ్రాం

విభాగాలు: ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.

కోర్సు వ్యవధి: రెండు సంవత్సరాలు.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ.

3) ఎంబీఏ ప్రోగ్రాం

కోర్సు వ్యవధి: రెండేళ్లు.

విభాగాలు: ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్/ ఫైనాన్స్/ ఇంటర్నేషనల్ బిజినెస్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ

4) పీహెచ్‌డీ ప్రోగ్రాం

విభాగాలు: అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, బేసిక్ అండ్ అప్లైడ్ సైన్సెస్, ఫుడ్ ఇంజినీరింగ్, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

దరఖాస్తు ఫీజు: ఇతరులకు రూ.1000, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.06.2023.

వెబ్‌సైట్: http://niftem.ac.in/

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512
edc@eenadu.in

ఆరేళ్ల సన్నద్ధత.. 3 కేంద్ర కొలువులు!

ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే అంత సులభం కాదు.. లక్షల మంది అభ్యర్థులు పగలూ రాత్రీ కష్టపడి చదువుతుంటారు. అంత శ్రమించినా ఒక్కోసారి విజయం సాధించడం కష్టమవుతుంది. అలాంటిది ఈ అబ్బాయి ఒకేసారి మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాడు.. అన్నీ ఆఫీసర్ స్థాయివే! అదీ 26 ఏళ్లు నిండకుండానే. ఈ విజయాల వెనుక ఆరేళ్ల సన్నద్ధత ఉంది. తను ఎలా ఈ ఉద్యోగాలు సాందాడో రుత్తల రేవంత్ వివరించారు. మనమూ తెలుసుకుందామా...

మాది అనకాపల్లి జిల్లా మాకవరపాలెం. నాన్న వ్యాపారం చేస్తుంటారు, అమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. చిన్నప్పటి నుంచీ నేనూ, తమ్ముడూ చదువులో ముందుండేవాళ్లం. ఇంటర్‌లో 903 మార్కులు వచ్చాయి. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో చేరాను. జాయిన్ అయ్యానే కానీ మొదటి రెండేళ్లు అసలు కాలేజీకి సరిగ్గా వెళ్లేవాడిని కాదు. పూర్తిగా డిఫెన్స్, నేవీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవాడిని.

« పరీక్షలకు మాత్రమే హాజరయ్యేలా ముందే యాజమాన్యంతో మాట్లాడుకున్నాను. దీనికోసం బెంగళూరు వెళ్లి కోచింగ్ కూడా తీసుకున్నా. అలా మొదటి రెండు మూడేళ్లలో 6 పోటీ పరీక్షలు పాసయ్యాను. అంతా అయిపోయింది అనుకునే సమయంలో మెడికల్ టెస్ట్‌లో ఫెయిల్ అయ్యేవాడిని. మొత్తం అన్ని ఉద్యోగాలూ ఆఖర్లో పెట్టే ఆ టెస్ట్ వల్లే రాకుండా పోయాయి. చాలా నిరుత్సాహపడ్డాను. కానీ తేరుకుని ఉపాయం ఆలోచించడం ప్రారంభించాను. అప్పుడే నా పోటీ పరీక్షల ప్రయాణంలో రెండో భాగం మొదలైంది.

« కొవిడ్ మొదటి వేవ్ సమయంలో హాస్టళ్లు మూతపడటంతో ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. రెండో వేవ్ ముగిశాక మళ్లీ హైదరాబాద్ వచ్చాను. అప్పటికి అంతా ఇంకా పూర్తిగా తెరుకోకపోవడంతో క్లాసులు సరిగ్గా జరిగేవి కాదు. కానీ నేను మాత్రం రూమ్‌లో ఉండి, నలుగురు ఫ్రెండ్స్‌తో కలిసి చదువుకుంటూ ఉండేవాడిని. కొన్నాళ్లకు అక్కడి నుంచి ఇంటికి వచ్చేశాను.

« ఊళ్లో నాలాగే సీరియస్‌గా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మరో ముగ్గురిని వెతికి పట్టుకున్నా. అందరం కలిసి కేవలం చదువుకోవడం కోసం ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాం. ఆ ఇంట్లో వేరే ఫర్నిచర్ ఏదీ ఉండేది కాదు. కేవలం చదువుకునే బల్లలు, ల్యాప్‌టాప్‌లు, ఎప్పుడైనా నైట్‌అవుట్ చేస్తే పడుకునేందుకు చిన్నపాటి పరుపులు ఉండేవంతే. అలా మా ప్రిపరేషన్‌కు ఆ ఇంటిని లైబ్రరీలా వాడుకున్నాం. అప్పుడే వరుసగా ఎస్ఎస్‌సీ సీజీఎల్ రాశాను.

« నేను ఫెయిల్ అవుతున్నది మెడికల్ టెస్టుల్లో కదా.. అందుకే అసలు ఆ టెస్టే లేని పరీక్షలు ఏం ఉన్నాయా అనేది వెతికేవాడిని. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకోవడం మొదలుపెట్టాను. అప్పుడు నా దృష్టి రైల్వే, ఎస్ఎస్‌ఎస్ సీజీఎల్ పరీక్షల మీద పడింది. తరచూ నోటిఫికేషన్లు రావడం, రిక్రూట్‌మెంట్ కచ్చితంగా జరిగే అవకాశం ఉండటంతో పూర్తిస్థాయిలో వాటిపై దృష్టి పెట్టాను. ముందు నుంచి నేను ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలకే ప్రయత్నించేవాడిని. టెన్త్, ఇంటర్ అర్హతతో నిర్వహించే ఏ ఒక్క పరీక్షనూ రాయలేదు. వాటితో క్యాడర్ మెరుగవ్వడానికి ఎక్కువ సమయం పట్టడమే ఇందుకు కారణం. ఒకవేళ వస్తే తృప్తిపడి అక్కడితో ఆగిపోతానని భయం. కేవలం డిగ్రీ అర్హతతో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలకే పోటీపడ్డాను. అలా సన్నద్ధత కొనసాగుతుండగా కరోనా రావడంతో ఒక్కసారిగా అంతా గందరగోళం అయిపోయింది.

« చివరికి అన్ని పరీక్షలూ కలిపి రైల్వే, కాగ్, కస్టమ్స్‌లో ఉద్యోగాలు సంపాదించాను. రైల్వేలో ట్రైయిన్ మేనేజర్‌గా లెవెల్ 5 జాబ్ వచ్చింది. కాగ్‌లో అకౌంటెంట్‌గా ఉద్యోగం వచ్చింది, అది కూడా లెవెల్ 5 జాబ్. చివరిగా కస్టమ్స్‌లో ఎగ్జామినర్ పోస్టు సంపాదించాను. ఇది లెవెల్ 7 ఉద్యోగం. ప్రస్తుతం ఇందులోనే చేరబోతున్నాను. నా స్కోరుకు బహుశా చెన్నైలో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉండొచ్చు. ప్రారంభ వేతనం రూ.80 వేల వరకూ ఉంటుంది.

« ఈ జర్నీలో చాలా సార్లు ఉద్యోగం వచ్చినట్టే వచ్చి చేజారిపోయేది. మొదటిసారి ఎస్ఎస్‌సీ సీజీఎల్‌లో 0.3 మార్కులతో జాబ్ పోయింది. రెండోసారి కూడా ఉద్యోగం రాకపోయేసరికి చాలా బాధపడ్డాను. అయితే మూడు, నాలుగు అటెమ్ప్ట్స్‌కి బాగా కష్టపడ్డాను. అప్పుడే కాగ్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఉద్యోగాలొచ్చాయి.

పుస్తకాలు

నేను రాసిన పరీక్షల్లో ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లకే అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇంగ్లిష్ కోసం 'వర్డ్ పవర్ మేడ్ ఈజీ' పుస్తకాన్ని అనుసరించాను. ఆప్టిట్యూడ్ కోసం రాకేష్ యాదవ్, కిరణ్ పబ్లికేషన్స్ పుస్తకాలు చదివాను. పినాకిల్ సిరీస్ కూడా బాగున్నాయి. జీకే కోసం లూసెంట్స్ చదివాను. రోజూ హిందూ పత్రిక చదువుతూ కొత్తపదాలను ఒక చోట రాసుకుని వాటి అర్థాలు తెలుసుకునే వాడిని. దానికోసం ప్రత్యేకంగా ఒక పుస్తకం పెట్టుకున్నాను. దీనివల్ల భాషపై బాగా పట్టు దొరికింది.

సన్నద్ధత

నాకు రాత్రుళ్లు మెలకువగా ఉండటం కష్టంగా అనిపించేది. అందుకే పొద్దున్నే 4, 4:30 మధ్య నిద్ర లేచేవాడిని. అప్పటికి ఎవ్వరూ నిద్రలేవకపోవడం వల్ల అంతా నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటూ చదువుకోవడానికి బాగా ఏకాగ్రత కుదిరేది. అలా పొద్దున్న 10, 11 గంటల వరకూ కదలకుండా చదివేవాడిని. తర్వాత కూడా సాయంత్రం 4 గంటల వరకూ చదివి తర్వాత గ్రౌండ్‌కి వెళ్లేపోయేవాడిని. ఎక్కడ ఉన్నా ఒక గంట బ్యాడ్మింటన్ ఆడటం అలవాటు. ఆ సమయంలోనే బాగా రిలాక్స్ అయ్యేవాడిని. రాత్రి త్వరగా పడుకుని మళ్లీ తెల్లవారుజామునే లేవడం... అలాగే రోజూ ప్రిపరేషన్ సాగేది.

కొత్తగా చదివేవారు...

కొత్తగా పోటీ పరీక్షలు రాసేవారు కనీసం ఒక ఏడాది పూర్తిస్థాయిలో క్లాసులకు హాజరుకావడం మంచిది. తర్వాత ఎక్కడ ఉండైనా సన్నద్ధత కొనసాగించవచ్చు. రోజుకు 8 నుంచి 10 గంటల సమయం వెచ్చిస్తే సరిపోతుంది. ఎంతసేపు చదివాం అనేదాని కంటే ఎంత ఏకాగ్రతతో చదివాం అనేది ప్రధానం. డైలీ మాక్ టెస్టులు రాయడంతోపాటు వారానికి ఒక్కసారైనా లైవ్ మాక్ టెస్టులు రాయాలి. అప్పుడే టైం మేనేజ్‌మెంట్ తెలుస్తుంది. నాకు ప్రిపరేషన్‌లో టెలిగ్రామ్ గ్రూప్స్ చాలా ఉపయోగపడ్డాయి. ఏదైనా సందేహం ఉంటే అందులో పోస్ట్ చేస్తే ఎక్కడెక్కడి నుంచో నాలాగే చదివేవారు రెస్పాండ్ అవుతూ కొత్త కొత్త షార్ట్‌కట్స్ చెప్పేవారు. రోజూ లేచాక ఇవాళ ఏం చదవాలి అనేది ఒక షెడ్యూల్ వేసుకుని రోజు పూర్తయ్యేలోపు ఏదోలా దాన్ని పూర్తిచేసేవాడిని. ఈ పద్ధతులు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటాయి. కానీ ఏళ్లకేళ్లు సన్నద్ధత పేరుతో వృథా చేసుకోకుండా మొదటి నుంచి ఒక ప్రణాళిక ప్రకారం వెళ్తే.. పాతికేళ్లలోపే ప్రభుత్వ కొలువు పొందొచ్చు!

పిలుస్తున్నాయ్.. ఫైన్ ఆర్ట్స్ కోర్సులు

సృజనను ఇష్టపడేవాళ్లు, కళలపై ఆసక్తి ఉన్నవారు రాణించగలిగే కోర్సుల్లో ఫైన్ ఆర్ట్స్, యానిమేషన్లు ముందుంటాయి. ఆసక్తి ఉన్నవారు ఇంటర్మీడియట్ విద్యార్హతతో వీటిలో ప్రవేశం పొందవచ్చు. ఈ చదువులు బోధిస్తోన్న సంస్థల్లో.. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ముఖ్యమైంది. ఇటీవలే ఈ విశ్వవిద్యాలయం యూజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన విడుదలచేసింది. పరీక్షలో ప్రతిభ చూపితే ప్రవేశం పొందవచ్చు!

ఫైన్ ఆర్ట్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ చదువులతోనే ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. మరింతగా రాణించాలనుకునేవారికి పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులూ ఉన్నాయి. ఈ స్థాయిలో స్పెషలైజేషన్‌పై దృష్టి సారించవచ్చు.

బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ) కోర్సుల వ్యవధి నాలుగేళ్లు. మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (ఎంఎఫ్ఏ) వ్యవధి రెండేళ్లు. స్వయం ఉపాధి, ఉద్యోగం రెండింటికీ ఈ కోర్సులు అనువైనవి. చదువుకున్న కోర్సును బట్టి వీరికి సాఫ్ట్‌వేర్, బహుళ జాతి సంస్థలు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీ మీడియా, యానిమేషన్...తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఆర్ట్ గ్యాలరీల్లోనూ వీరు తమ ప్రతిభను చాటవచ్చు. ఫొటోగ్రఫీ చేసిన వారికి అన్నిచోట్లా అవకాశాలు ఉంటాయి. చాలా మంది ఫ్రీలాన్సింగ్, స్వయం ఉపాధి (వర్క్ షాపు నడపడం) ద్వారా పెద్దమొత్తంలో సంపాదిస్తున్నారు. ఎండోమెంట్, ఆర్కియలాజికల్ విభాగాల్లో వీరికోసమే ప్రత్యేక ఉద్యోగాలున్నాయి.

కోర్సులు

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, హైదరాబాద్.. బీఎఫ్ఏలో పెయింటింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, స్కల్ప్‌చర్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ కోర్సులు అందిస్తోంది. ప్రవేశ పరీక్షకు సంబంధించి సిలబస్ వివరాలు, మాదిరి ప్రశ్నపత్రం వెబ్‌సైట్‌లో ఉంచారు. వాటిద్వారా పరీక్ష సన్నద్ధం కావాల్సిన అంశాలపై అవగాహన పొందవచ్చు. పరీక్షలో అర్హతకు కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి.

ఫొటోగ్రఫీ

కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ వంద మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ఇందులో డ్రాయింగ్, కంపోజిషన్ నైపుణ్యాలు పరిశీలిస్తారు. పెన్సిల్‌తో ఇచ్చిన చిత్రాలకు షేడ్‌లు ఇవ్వాలి. అలాగే అక్కడున్న చిత్రాలను క్రమ పద్ధతిలో అమర్చాలి. ఏదైనా అసంపూర్ణ దృశ్యం ఇచ్చి దాని చుట్టూ ఉండే అవసరమైన ఇతర అంశాలను అందులో చేర్చి తీర్చిదిద్దమంటారు. వీటన్నింటికీ పరీక్షలో ప్రాధాన్యం ఉంటుంది. అలాగే మరో ఆబ్జెక్టివ్ టైప్ పేపర్ 50 మార్కులకు 50 నిమిషాల వ్యవధితో ఇస్తారు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్ 15, ఇంగ్లిష్ 15, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు.

ఇంటీరియర్ డిజైన్

ఈ సంస్థ బ్యాచిలర్ ఆఫ్ డిజైన్‌లో భాగంగా ఇంటీరియర్ డిజైన్ కోర్సు నడుపుతోంది. అందులోనూ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందుకోసం 200 మార్కులకు 3 గంటల వ్యవధితో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో జీకే, కరంట్ అఫైర్స్ 20, జనరల్ ఆర్ట్ 20, కమ్యూనికేషన్ స్కిల్స్ 50, ఇలస్ట్రేటివ్, ఎనలిటికల్ అండ్ డిజైన్ ఎబిలిటీ 50, మెమరీ డ్రాయింగ్ 30, కలర్ కోఆర్డినేషన్ 30 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఒక్కోప్రశ్నకు ఒక మార్కు. **అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణత.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 5

ఫీజు: రూ.1800 ఎస్సీ, ఎస్టీలకు రూ.900

పరీక్ష తేదీలు: ఫొటోగ్రఫీ, ఇంటీరియన్ డిజైన్‌లకు జూన్ 17. అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, యానిమేషన్‌ల్లో జూన్ 18.

పరీక్ష కేంద్రం: హైదరాబాద్.

వెబ్‌సైట్: https://jnafauadmissions.com

పరీక్షలు

వీటిని ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తారు.

అప్లయిడ్ ఆర్ట్స్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, యానిమేషన్ కోర్సులకు...

పేపర్ ఎ

మెమరీ డ్రాయింగ్, కలరింగ్ విభాగాల్లో వంద మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ఈ విభాగంలో ఏదైనా అంశాన్ని ఇస్తారు. దానికి దృశ్య రూపాన్ని ఇవ్వాలి. ఎంత అందంగా గీశారు, నైపుణ్యం ఎలా ఉంది, ఉపయోగించిన రంగులు... వీటికి ప్రాధాన్యం. పేపర్ బి ఆబ్జెక్టివ్ తరహాలో 50 మార్కులకు 50 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ఇందులో జీకే, కరంట్ అఫైర్స్ 15, ఇంగ్లిష్ 15, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పేపర్ సి ఆబ్జెక్ట్ డ్రాయింగ్‌లో వంద మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో ఉంటుంది. ఇందులో భాగంగా ఏదైనా పుస్తువు లేదా బొమ్మ చూపిస్తారు. ఆ దృశ్యాన్ని పెన్సిల్‌తో గీచి, దాని చుట్టూ పరిసరాలను ఊహించి వర్ణనాత్మక చిత్రాన్ని రూపొందించాలి. ఇందులో చిత్ర నైపుణ్యాలు, ఊహ, పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఉంటుంది.

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప ఇవే కోర్సులను యూజీలో అందిస్తోంది. అపరాధ రుసుముతో మే 28లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు www.ysrafu.ac.in/ చూడవచ్చు.

గురి తప్పుతోందా?

చాలామంది విద్యార్థులకు చేతిలో పుస్తకం ఉంటుంది. కానీ ఆలోచన లన్నీ చేసిన పనులు లేదా చేయ బోయే పనుల చుట్టూ తిరుగుం టాయి. ఆ తర్వాత చదివింది అర్థం కావడం లేదని బాధపడుతుంటారు. దీనంతటికీ కారణం ప్రస్తుతం చేస్తున్న పని మీద ఏకాగ్రత లేకపోవడమే. ఇదే విషయాన్ని చక్కగా వివరిస్తుందీ కథ.

ఒక ఊరిలో ముగ్గురు స్నేహితులు ఉండేవారు. చదువు, ఆటపాటలు, కొత్త విషయాలు నేర్చుకోవడం... ఇలా అన్ని పనులూ కలిసే చేసేవారు. ఒకరోజు ముగ్గురూ కలిసి ఊరి బయట తుపాకీతో గురి పెట్టి.. బెలూన్లను పేల్చడం నేర్చుకోసాగారు. ఈ పని పూర్తయిన వెంటనే పక్క ఊరిలో జరిగే జాతరకు వెళ్లి సరదాగా గడపాలనుకున్నారు. వారి ఆలోచనలన్నీ జాతర చుట్టే తిరగసాగాయి.

ఎదురుగా కాస్త దూరంలో బెలూన్లను వేలాడదీసి వాటిని పేల్చడం సాధన చేయసాగారు. ఎంత ప్రయత్నించినా ఒక్కరు కూడా గురిచూసి తుపాకీ పేల్చ లేకపోతున్నారు. ఇదంతా గమనించిన ఒక వ్యక్తి నవ్వుతూ వారి వైపు చూశాడు. దాంతో స్నేహితులకు కోపం వచ్చింది. 'నవ్వడం కాదు... చేతనైతే పగలగొట్టండి చూద్దాం' అన్నారు. ఆయన తుపాకీ అందుకుని మొదటి ప్రయత్నంలోనే గురిపెట్టి బెలూన్‌ను పేల్చాడు. ఇదెలా సాధ్యమని వాళ్లంతా ఆశ్చర్యపోయారు. దానికాయన శాంతంగా ఇలా చెప్పాడు- 'చేస్తున్న పని మీద మీరు దృష్టిపెట్టటం లేదు. మరేదో విషయమ్మీద మీ ఆలోచనలు ఉన్నట్టున్నాయి. దీంతో ఏకాగ్రత కుదరక మీ గురితప్పుతోంది!'